క్లుప్తంగా

రైతుబంధు రూ.10 వేలకు పెంచాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధును ఎకరానికి రూ.10 వేలకు పెంచాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 10 ఎకరాల వరకు పరిమితిని విధించాలని కోరారు. వంద ఎకరాలు ఉన్న వాళ్ల కూడా రైతు బంధు ఇవ్వడంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని అన్నారు.

నేటి నుంచి మహాభారత నాటక ప్రదర్శన

జడ్చర్ల టౌన్: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు చిరుతల మహాభారతం నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ కళామండలి సభ్యులు కృష్ణయాదవ్ తెలియజేశారు. రాత్రి 9గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5గంటల వరకు నిర్వహించే నాటక ప్రదర్శన తిలకించేందుకు తరలి రావాలని కోరారు. రఘురాములు పంతులు ఆధ్వర్యంలో ప్రదర్శన ఉంటుందని వివరించారు.

నేడు కోడ్గల్‌కు మంత్రి రాక

జడ్చర్ల: మండల పరిధిలోని కోడ్గల్‌కి బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ,ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విచ్చేస్తున్నట్లు ముడా డైరెక్టర్ ఇమ్ము తెలిపారు. కోడ్గల్‌లో కొత్తగా నిర్మించిన గురుకుల పాఠశాల భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు.

అంటు వ్యాధులపై అవగాహన

నవాబుపేట: అంటూ వ్యాధులపై ప్రజలకు కళాజాతా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం మండల పరిధిలోని గురుకుంటలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ద్వారా కార్యక్రమం నిర్వహించారు.

కళాశాలలో చేరాలని ఇంటింటి ప్రచారం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ మంగళవారం చిల్వేర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అఖ్తర్, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



హన్వాడ: మండలకేంద్రానికి చెందిన నర్మద ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందింది. కాగా ఆమెతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు (2003 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్) ఆమె కుమార్తె శిరీష పేరిట రూ.50వేలు నగదును స్థానిక ఏపీజీవీబీలో డిపాజిట్ చేశారు. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వారంతా కలిసి ఈ నగదును పోగు చేశారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని శిరీషకు భరోసానిచ్చారు. వెంకన్న, కేశవులు, ప్రవీణ్, కేశవులు, శ్రీనివాసులు, రవి, బాలయ్య, బురాన్, మమత, శారద తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు 42మంది ఎంపిక

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లి శ్వేతా విద్యామందిర్‌కు చెందిన 42 మంది విద్యార్థినీ, విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక అయ్యారని కరస్పాడెంట్ నరేందర్‌జీ, ప్రిన్సిపాల్ సుహార తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను సర్పంచ్ మాణిక్యమ్మ, పాఠశాల బృందం అభినందించారు.

సీఎం కప్‌లో రజత పతకం



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లాకు చెందిన జి.శ్రీకాంత్ వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణించాడు. వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. శ్రీకాంత్‌ను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, కోచ్ చంద్రశేఖర్‌గౌడ్ అభినందించారు.

వైభవంగా గజలేశ్వరీ దేవి జాతర

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో కొలువుదీరిన గజలేశ్వరి దేవి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. జల్దిబిందె ఊరేగింపు, అమ్మవారి పల్లకీసేవ, బోనాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతి, అన్నదాన కార్యక్రమం, రెట్టపట్ల పోటీలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో?

- అసంపూర్తిగా మన ఊరు మన బడి పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు



గండేడ్‌లో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్

గండేడ్: గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యవస్థను పటిష్టం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, మైనర్, మేజర్ రిపేర్లు ప్రహారీల నిర్మాణం, డైనింగ్ హాల్ వంటి పనులను చేపట్టారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మన ఊరు మన బడి నిధులతో పాటు ఎంఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టేలా ప్రణాళిక చేపట్టారు. కానీ కాంట్రాక్టర్లు, ఎస్‌ఎంసీల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. జూన్‌లో బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతుల కల్పన కలగానే మిగిలిపోయే ప్రమాదముందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఉమ్మడి గండేడ్ మండలంలో 88 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 7542 మంది విద్యాభ్యాసం చేస్తుండగా 342 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. గండేడ్ మండలంలో 18 పాఠశాలలు, మహమ్మదాబాద్ మండలంలో 13 పాఠశాలలను మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఎంపిక చేశారు. గండేడ్ మండలానికి రూ. 3.39 కోట్లు, మహమ్మదాబాద్‌కు రూ. 2.49కోట్లు మన ఊరు మనబడి కింద నిధులు, రూ. 2.40 కోట్లు , రూ. 3.34 కోట్లు ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కేటాయించారు. కేవలం 5 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా అన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కొన్నిచోట్ల నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు పూర్తి స్థాయిలో కసరత్తు చేయకపోవడం వల్లే పరిస్థితి తలెత్తిందని పలువురు అంటున్నారు.



అర్ధాంతరంగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారిన సంపు

గండేడ్ మండల కేంద్రంలోని డైనింగ్‌హాల్ పిల్లర్లకే పరిమితమైంది. అసంపూర్తిగా వదిలేశారు. సంపు కోసం లోతుగా గుంత తవ్వి వదిలేశారు. ప్రస్తుతం అందులో నీరుతో నిండి ఉంది. ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పునాది , పిల్లర్లు నిర్మించి వాటికి నీళ్లు కూడా సరిగ్గా పోయలేదు. బల్సూర్‌గొండలో చైర్మన్, సర్పంచుల మధ్య వివాదం కారణంగా పలు పనులు ఆగిపోయాయి. చౌదర్‌పల్లి పెద్ద తండాలో చైర్మన్ పనులు చేయకపోగా సర్పంచు పనులు చేపట్టారు. ఎస్‌ఎంపీ అకౌంట్‌లో పడ్డ డబ్బులు సక్రమంగా ఇవ్వడం లేదని సర్పంచ్ మిగతా పనులు చేపట్టడం లేదు. కొండాపూర్‌లో ప్రహరిగోడ నిర్మాణం నిలిచిపోయింది. పలుచోట్ల నిర్మాణాలు సైతం నాసిరకంగా చేస్తున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పూర్తిచేయాలని కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం..

గండేడ్‌లో బాలుర పాఠశాలలో పనులు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చాం. ఆ పనులు వేరేవారికి అప్పగించి త్వరలో పూర్తయ్యేలా చూస్తాం. పెద్దవార్వాల్‌లో సైతం పనులు ప్రారంభం అయ్యాయి. చౌదర్‌పల్లిలో సర్పంచు, ఎస్‌ఎంసీ మధ్య వివాదం కారణంగా పనులు నిలిచిపోయాయి. వాటిని కూడా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మహమ్మదాబాద్ పాఠశాలలో కూడా పనుల్లో వేగం పుంజుకొనేలా చూస్తాం.

– ఇక్బాల్ పాష ఏఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐసీడీ

ధాన్యం తీసుకోకుంటే ఆందోళనలు చేస్తాం



మాట్లాడుతున్న దుశ్యంత్‌రెడ్డి

నవాబుపేట: రైతుల ధాన్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని డీసీసీ అధికారప్రతినిధి దుశ్యంత్ రెడ్డి హెచ్చరించారు. మండలపరిధిలోని తీగలపల్లి సమీపంలో ఉన్న రైస్ మిల్లులో ధాన్యం దిగుమతిపై రైతులతో కలిసి యజమానిని మంగళవారం ప్రశ్నించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా వారం రోజుల నుంచి లోడింగ్ చేయలేదని అన్నారు. తీరా లోడ్ చేస్తే మిల్లర్లు ధాన్యం తడిసిందని కొర్రిలు పెట్టడం విడ్డూరమన్నారు. అధికారులు స్పందించి ధాన్యం తడిసినా మిల్లర్లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యం బస్తాల విషయంలో 40 కేజీలకు 3 కేజీల కోతను నిలువరించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల: బాదేపల్లి ఊరచెరువులో అక్రమంగా కొనసాగిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్‌లు ఉమాశంకర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఊరచెరువులోని శిఖం భూమిలో ఇళ్ల నిర్మాణానికి కొందరు ప్రయత్నించడంతో అప్పట్లో జిల్లా అధికారులు స్పందించి పనులను నిలిపివేయించారని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ నిర్మాణాలను మొదలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వెంటనే నిలిపివేయాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పరిసర గ్రామాల యువకులు

బాలానగర్: మండల కేంద్రం నుంచి పెద్దరేవల్లికి వెళ్లే రోడ్డు గుంతమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని మరమ్మతు చేయాలంటూ పరిసర గ్రామాల యువకులు మంగళవారం రైల్వే స్టేషన్ సమీపంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బాలానగర్ నుంచి హేమాజిపూర్, చింతగూడ, బూర్గుల, నేలబండ తండా, బిల్డింగ్ తండా, అప్పాజిపల్లి, బోజానంపేట్, పాలుగుమీది తండా, మొదంపల్లి, చిన్నరేవల్లి, ఏడుగుట్టలతండా, పోచమ్మగడ్డ తండా, తిరుమలగిరి, పెద్దబాయితండా, మన్నెగూడ తండాల గ్రామాలకు ఇదే రహదారి ప్రధాన దారి కావడంతో సమస్యగా మారిందని వాపోయారు. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవలే గౌతాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందాడని అన్నారు. గతంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హామీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొండకల్ల విష్ణువర్దన్, శంకర్, శ్రీనునాయక్, శివ కృష్ణ, సంతోష్, కుమార్, హన్మంతు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బోయపల్లికి చెందిన కాంగ్రెస్ మాజీ కార్యదర్శి కారంగి చంద్రశేఖర్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ పత్తి వెంకట్‌రాములు, ముడా చైర్మన్ వెంకన్న, శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్లు మోతిలాల్, సత్యంయాదవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అత్యాచారం, హత్యలు, దాడులు, కుల దురహంకారాలకు గురైన బాధితులకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కుర్మయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదైన బాధిత కుటుంబాలకు మూడేళ్లుగా డబ్బులు ఇవ్వడం లేదని, జిల్లాలో 46 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన హత్య కేసుల్లో సగం మంది బాధితులకు కూడా సాయం అందలేదన్నారు. నిర్లక్ష్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లెల మాణిక్యంరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్దన్, నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక భగీరథ కాలనీ చౌరస్తా నుంచి మైనారిటీ గురుకుల పాఠశాల వరకు రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, 11వ వార్డు కౌన్సిలర్ ఎస్.శ్రీనివాసులు, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మన్సూర్‌పల్లిలో ఒకరికి డెంగీ



మన్సూర్‌పల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య అధికారులు

- గ్రామాన్ని సందర్శించిన జిల్లా అధికారులు

గండేడ్: మన్సూర్‌పల్లిలో ఒకరికి డెంగీ సోకింది. దీంతో అప్రమత్తం అయిన జిల్లా అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించారు. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన వెంకన్న(76) అనారోగ్యంతో ఈ నెల 20న మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. వైద్యులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈనెల 22 వెంకన్న మహబూబ్‌నగర్‌కి వెళ్లి చూయించుకున్నారు. కాగా మరుసటి రోజు నుంచి జ్వరం రావడంతో అనుమానం వచ్చిన వైద్యాధికారులు 25 వ తేదీన రక్తం నమూనాలు సేకరించి పరీక్షించారు. అదేవిధంగా సోమవారం నమూనాలు సేకరించి పరీక్షించగా డెంగీ లక్షణాలు బయటపడ్డాయి. దీంతో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా మలేరియా అధికారి శ్వేత, సబ్ యూనిట్ అధికారి రమేశ్ , గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌లు గ్రామాన్ని సందర్శించారు. జిల్లా మలేరియా అధికారిణి శ్వేత మన్సూర్‌పల్లితో పాటు, మన్సూర్‌పల్లి తండాల్లో సైతం ఫీవర్ సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు.ఆందోళన చెందల్సిన అవసరం లేదన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం పెంపొందిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో దోమల నివారణకు స్ప్రే చేయించామన్నారు. సీహెచ్ఓ రాములు, సూపర్‌వైజర్ అలివేలు తదితరులు ఉన్నారు.

మండలం ఏర్పాటుపై కలెక్టర్‌కు వినతి



నారాయణపేట: కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు బి.రాము, బీజేపీ రాష్ట్ర నాయకులు కెంచె శ్రీనివాసులు, సర్పంచ్ విజయలక్ష్మి, మండల సాధన సమితి కో కన్వీనర్ యాదగిరి, చెన్నప్ప యాదవ్, సాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

21వ రోజుకు చేరిన రిలే దీక్షలు

కోటకొండను మండలంగా ప్రకటించాలంటూ చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 21వ రోజుకు చేరుకున్నాయి. బొలేరో వాహనాల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలో అంగడి బాలకృష్ణ, తీగలరాజు ఉన్నారు.

నేడు దశాబ్ది ఉత్సవాలపై సదస్సు

గండేడ్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఉమ్మడి మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కోయిల్‌కొండ: మండలంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసి సమీక్షా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తహశీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

మద్దూరు: మండలంలోని కొత్తపల్లి, ఖాజీపూర్, మద్దూరు, భూనీడ్ తదితర గ్రామాల్లో పోచమ్మకు బోనాలేత్తారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనమెత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మేకలు, కోళ్లను అమ్మకు సమర్పించారు.

రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్నా అధికారులు

గండేడ్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంప్రసాద్, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జూన్ 3న రైతు వేదికల్లో కార్యక్రమం నిర్వహించాలన్నారు. రైతుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. భోజన వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశానుసారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ కృపాకర్‌రెడ్డి, ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఆర్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు ప్రణాళిక ప్రకారం రైతు దినోత్సవం, మహిళ దినోత్సవం, సహపంక్తి భోజనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సీఐటీయూ ద్వారానే హక్కుల సాధన



జడ్చర్లలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సీఐటీయూ ద్వారానే ఉద్యోగ కార్మికుల హక్కులు సాధించుకోగలుగుతామని రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెండాలను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు, 8 గంటల పనిని 12 గంటలకు పెంచారని అన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చి హక్కులను కాలరాస్తున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలెన్న, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎర్ర నర్సిములు, కుమ్మరి కృష్ణయ్య, రాజ్‌కుమార్, కొండన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆశయాలు నెరవేరుస్తాం..

జడ్చర్ల టౌన్: సీఐటీయూ ఆశయాలను నెరవేరుస్తామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఐక్యత పోరాటం సీఐటీయూ నినాదాలని వాటిని నెరవేర్చేందుకు పాటుపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 44 కార్మిక చట్టాలను మార్చిందని, వాటిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు కాంట్రాక్టు కార్మికుడే లేకుండా చేస్తానని ఇచ్చిన హామీ విస్మరించారన్నారు. దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో కార్మికుల్ని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, నాయకులు కళమ్మ, భారతి, భీమమ్మ, రసూల్, అంజమ్మ, దేవమ్మ, రాజు, విద్యాసాగర్, బాల్‌వెంకట్, శ్రీనివాసులు, యాదయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

జడ్చర్ల: వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు వెంకటేష్ బాదేపల్లి నగర పంచాయతీ కార్యాలయం ఎదుట సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు కృష్ణ, చెన్నయ్య, కళమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు, గురువులు

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మంగళవారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అప్పటి గురువులు శంకర్‌రెడ్డి, మురళీధర్, బస్వరాజ్, సాయికుమార్, నరేందర్, సాయిలు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ఆరోగ్య సర్వేలో వివరాలు నమోదు చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కోసం తయారు చేసిన ప్రశ్నపత్రంలో వికలాంగుల వివరాలు నమోదు చేయడానికి అవసరమైన ప్రశ్నను తీసివేయడం సరైంది కాదని, తక్షణమే వికలాంగుల పదాన్ని చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు టి.మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 జూన్ నుంచి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, గతంలో చేసిన సర్వేలకు భిన్నంగా ఈసారి వికలాంగుల వివరాలను నమోదు చేయడానికి ప్రశ్నపత్రంలో చోటు కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటూనే వికలాంగులను ఎందుకు విస్మరిస్తున్నారని అన్నారు. వైకల్యం వైద్య ధ్రువీకరణపై నిర్ణయిస్తారని, వివరాలు నమోదు చేయకపోతే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

స్థానిక సంస్థల పరిధిలో ఉత్సవాలు



వీసీలోపాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ సీతారామారావు ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రం ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను స్థానిక సంస్థల పరిధిలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, అదనపు కలెక్టర్లతో మంగళవారం మాట్లాడారు. జూన్ 2న నిర్వహించే అవతరణ దినోత్సవంతో పాటు, 22వ తేదీ వరకు నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను అన్ని జిల్లాలలో విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. 21 రోజులపాటు కొనసాగే దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వ ఆదేశాలు, కార్యాచరణ ప్రకారం నిర్వహించాలని తెలిపారు. జూన్ 15 న నిర్వహించనున్న తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా గ్రామాలలో చేపట్టిన పనులను తెలియజేయడంతోపాటు, పల్లె ప్రగతి ద్వారా సాధించిన కార్యక్రమాలను వివరించాలని చెప్పారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల కృషి వల్ల అంటువ్యాధులు తగ్గి ఆరోగ్య ప్రమాణాలు పెరిగాయని అందువల్ల వారిని సన్మానించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠ దామాలు వంటి వాటన్నింటిపై వివరించాలని కోరారు. పండుగ వాతావరణంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె .సీతా రామారావు, డిప్యూటీ సీఈఓ మొగులప్ప, డీపీఓ వెంకటేశ్వర్లు, ఏపీడీ శారద, డివిజనల్ పంచాయతీ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.